కథానిక :

# పళ్లు విరిగిన దువ్వెన

## శ్రీ దోగిపర్తి వెంకటరమణ

పళ్ళు విరిగిన దువ్వెన!...

ఎముకలు విరిగీ...కాలం మళ్ళీ జిడ్డు ముసలి ముహంతో మసగ్గా కిందపడి వుంది! పోట్లాటలో విజయం సాధించి, వీరి ఆప్యాయంగా చేతుల్తో పైకి లేవనెత్తి... జిడ్డు తుడిచి మట్టి దులిపాడు! ... దీని కోసమే ఇందాకణ్ణుంచీ రణగోల!...సీతికీ తనకీ మధ్య భీకరపోరాటం!—పొద్దుణ్నుంచీ ఇద్దరిమధ్య ఒకటే ఆరాటం! రక్తసంబంధాలు త్రెళ్ళిపోయి, సౌదర్యాలు సమసిపోయి—ఈర్ష్య, విద్వేషం పెనవేసుకొని, వాగ్వాదం ద్వంద్వసంఘర్షణ ... సీతిని ఓడించేసి, ఆఘుర్షణలోంచి బయటికి తీశాడు వీరిగాడు, గర్వరేఖ ముఖంమీద మొలిపించుకొంటూ — సీతి బిక్కముహం వేసుకు చూస్తోంది! ఇందాకణ్ణుంచీ దొర్లి దొర్లి దెబ్బలాడిదెబ్బలాడి నలిగిపోయినపరికిణీ... నూనెడాగులూ, మరకలూ పడ్డ నీలంరంగు జుబ్బా... జుట్టురేగి, బొట్టురేగి, కాటుక చెరిగి ... ఈర్ష్యగా ఆ విరిగిన పళ్లదువ్వనవైపే మనసు లగించి చూస్తోంది!

'నాకదే కావాలి. నాకదే కావాలి' అన్నట్టు ప్రగాఢవాంఛ—చూపులో తనకి దక్కక మరోవాళ్ల చేతికి దక్కిపోయిందన్న ఈరసం, అసహ్యం—ఎడనెడ కళ్ళల్లో మెదిలిస్తూ, నీడలు నీడలుగా దుఃఖ మేఘాలు పరుచుకుంటూ చూస్తోంది!

వీరిగాడికే ఎందుకు దక్కాలి? ఆపళ్లు విరిగిన దువ్వెన? వాడు ముందుగా చూసి కాజేశాడు. చెలరేగిన ముంగురులు కళ్ళకడ్డంగా పడుతున్నాయ్!

కోపంగా కళ్లెఱ్ఱగిల్లగా పళ్లు బిట్టుగఱచి—"ఏరా వీరీ! నా దువ్వెన నాకిచ్చీ"—అంది. ఈసారి కళ్ళల్లో కోపావేశం పెదవులమీంచి జారిపడింది.

వీరిగాడు మాత్రం...ఆ 'రుద్రమాంబా భద్రకాళీ లోచనోజ్జ్వలరోచు'లకి హడలెత్తి పళ్ళులేని దువ్వెన పారేసి పారిపోలేదు! సరిగదా—హెహ్హె హ్హె అని హేళనగా నవ్వాడు ముఖానికి వికారం పూసుకుని.

'మగవాడిది నాదిసువా హక్కు...ఈ హక్కు భుక్తా లనుభవించాల్సినవాణ్ణి నేను' అన్నట్టు నవ్వుతూ చూశాడు, ఈ నవ్వుని తిట్టుకింద వెటకారం కింద వెక్కిరింతకింద జమకట్టే......"ఊఁ ఊఁ నా దువ్వెన నాకిచ్చీ" అని ఏడుపు సాగించింది. వీరిగాడికీ ఏడ్చే ఆడవాళ్ల రహస్యం తెలిసిందికాదు లేకపోతే తనూ పెంకులెగరగొట్టును! ప్రస్తుతాని కీతగువు ఏవిధంగానూ పరిష్కారం కావడానికి, ఒక వెలుగు గోచరించలేదు. ఇద్దరూ చీకట్లో చిందులు తొక్కుతున్నారు. ఇందాకణ్ణుంచీ వంటింట్లో పని చేసుకొంటోన్న మంగతాయారుకి—ఆడపిల్ల సీతి ఏడుపు ఛర్రుమని అంటుకుంది.

చేతిలో అట్లకర్రతో బయటికి ప్రత్యక్షమౌతూ..."ఏవిఁట్రా! వెధవ రణగోల మీరూను... ఇల్లు తీసి పందిరేస్తున్నారు! ఏం వొచ్చింది మీ ప్రాణాలకి." అంది విసుపూ కసురూ మాటల్లో విసురుతూ.

వీరిగాడికీ విషయం అంతుచిక్క చావలేదు! ఇందాకణ్ణుంచీ, తామైపోట్లాడుకుంటూన్న విశేషం ఇంత చులకనగా లేకిగా తీసిపారేయడం చాలా అసహ్యమనిపించింది! ఒక సమస్య పరిష్కరించుకొనే నిమిత్తం తమ పోట్లాట ప్రాధాన్యతని గుర్తించకుండా, తెలుసుకోకుండా దాన్ని 'గోల' అని కొట్టిపారేయడం ఏవిధంగానూ సహించరానిదైంది!

"నీకు గోలగావుంది మరి! ఈ దువ్వెన నాదయితే, ఇందాకణ్ణుంచీ, ఇమ్మని పీకుతోంది చెల్లి" అన్నాడు, దువ్వెన జోబిలో దాచేసుకుని, దాని వాసన సైతం పైకి పీచకుండా చేతుల్తో కప్పుతూ...

"ఏం దువ్వెన్రా అది? ఏదీ పైకితియ్యి" అంది మంగతాయారు.

"అమ్మా! నా దువ్వెన నా కిచ్చిమనే"—సీతి మళ్ళీ అదే పాట పాడింది ఏడుపులోంచి తొంగి చూస్తూ...

వీరిగాడు దువ్వెన పైకితీసిన పాపాన పోలేదు. ఒక్కసారి 'ఊహుఁ' అని, బుర్ర అటు హిమాలయ పర్వతాలనించి కన్యాకుమారి అగ్రందాకా తిప్పేశాడు.

సీతి పరికిణీ వేళ్ళతో తమాషాగా గుండ్రంగా చుట్టబెట్టుకుంటూ, బద్ధకంగా వళ్ళు విరుస్తూ—చిగుళ్ళపైకి శీఘ్రంగా కనపడేట్టు—పెదవులు సెలవివార సాగదీసి, ఏడుపు మళ్ళీ సాగించింది!—ఇదే

అదనన్నట్టు, ఈ అదనుదాటితే దువ్వెన తనకు దక్కదన్నట్టూ.

“దువ్వెన తీస్తావా? తన్నన్రా వెధవా?” అని చేయెత్తింది మంగతాయారు. వీరిగాడికి చేయెత్తేసరికి —ఎంత ధీమాగల మగవాడైనా—వణుకుపుట్టింది. ఐనా బలవంతంగా దువ్వెన వేళ్లసందుల్లో బిగబట్టి, నెమ్మదిగా పైకితీసి చూపించాడు. ఒకవేళ సీతి మీద పడి గబుక్కున లాక్కుని పారిపోతుందేమో అన్నంత భయపడుతూ...

గుప్పెట్లోంచి, సందు గుమ్మంలోంచి ముసలవ్వ తొంగిచూసినట్టు తొంగిచూసింది దువ్వెన పళ్లూడిపోయిన బోసిభాగాన్ని స్పష్టంగా చూపుతూ...

“ఓరి నీయిల్లు బంగారంగానూ...పళ్లు విరిగిన నీలం దువ్వెనట్రా! ఏ పెంట కుప్పమీద సంపాయించావ్రా? అవతలపారేయ్!” అంది మంగతాయారు విరగబడి నవ్వుతూ. వీరిగాడికి రోషం, ఆవేశం, ఆవేగం గుబులుకొచ్చింది. ఇల్లంతా గాలించి గీలించి, సంపాయించిన దువ్వెన్ని చూసి, విరగబడి నవ్వుతుందా? కన్నకొడుకు పడ్డకష్టాన్నయినా కానరాదే తల్లి?...సహించలేకపోయాడు వీరిగాడు. దుఃఖ పర్యంతం కళ్లల్లోంచి ప్రవహించ నుంకించింది. కాని రసాభాస ఔతుందేమో అని, తనూ ‘హిఁ హిఁ హీఁ’ అని నవ్వేసి ఊరుకొన్నాడు.

“ఇది నాదేనేవ్! అమ్మా! సీతికి దాన్ని చూస్తే కళ్లుకుట్టాయి. నాదగ్గరేదుంటే అది లాక్కోవాలంటుంది. దానిమీదే గంటలతరబడీ పడేడుస్తుంది. అది మొన్న కొనుక్కున్న రిబ్బను నాటకం వాడిలా కట్టుకుంటానంటే ఇచ్చిందేమో...? అడుగు! అన్నీ దానివి పీనాసిబుద్ధులేనే! ... నా కణికలోంచి రోజుకో బలపమ్ముక్క విరిచేస్తోంది దొంగముం...”

“ఛీ వెధవా నోరుముయ్! ఆడపిల్లనలా అనొచ్చా? నోరు నొక్కుతా...”

మంగతాయారు చేతిని కొట్టడానికి తయారు చేస్తూ అంది! “ఈ యిల్లూ పొలాలూ, ఆ స్తిపాస్తులన్నీ నువ్వనుభవించడానికే కాదురా! దానికేవుంది? ఆ పసుపుతాడు మెడలో పడగానే...అత్తారింటికి వెళ్లిపోతుంది! ఈ ఉండే నాలుగురోజులన్నా దాన్ని నిలబడనీయ్!” ముఖంతీక్షణంగా మార్చి స్పష్టంగా ఒక సిద్ధాంతాన్ని స్థాపిస్తున్నట్టు అంది!

“శేష త్తయ్యగారింటికి నేనూ వెడతాను! సీతేనేమిటి మహా వెళ్లేది! అదేనేమిటి మహా ఊడ బొడిచింది!...అక్కడ సోమిగాడూ నేనూ ఎంచక్కా గోలీకాయలూ, గూటీబిళ్లలు ఆడుకొంటాం”—వీరిగాడు ఊరిస్తూ, బెల్లిస్తూ అన్నాడు.

దేవుడి గదిలో జపంచేసుకుంటూన్న నాయనమ్మ చావిట్లోకొచ్చి, “ఏవేఁ? మంగా? ఏవిఁటీ జగడం” అంది.

నాయనమ్మదగ్గర సీతికి మరింత చనువెక్కువేమో—దాంతో ఆవిడదగ్గర కెళ్ళి గునిసింది ‘నాయనమ్మా! దువ్వెనిప్పించవూ?’ అంటూ.

“పళ్లు విరిగిన పాడుదువ్వెన! ... ఛీ ... అదెందుకే? నాన్నగార్ని రానీ మంచిది కొనుక్కుందాం— ఆ వెధవకి చూపెట్టవన్నా చూపెట్టమాక—”మంగతాయారు కూతుర్ని బుజ్జగిస్తూ అంది.

“కొనుక్కుంటే కొనుక్కోమను నాకేంఅక్కరలేదు...” నాయనమ్మ సీతిని దగ్గరికి లాక్కుని, “పోన్లేవే! నీకణా ఇస్తా ఏవఁన్నా కొనుక్కుందూ గాని...”

ఈమాటలు వినేసరికి, వీరిగాడి నోరూరింది. అంతా, సీతినే దగ్గరికిలాక్కోవడం, బుజ్జగించడం — ఎప్పుడూ ఇవ్వనన్నవి ఇచ్చేస్తాననడం —చిత్రంగా వెగటుగా ఈర్ష్యగా తోచింది. మెల్లిగా నాయనమ్మ దగ్గరగాజేరి, “నాయనమ్మా! ఈ దువ్వెనిస్తా ఏమిస్తావ్?” అన్నాడు.

“ఈ దువ్వెనకి నాదగ్గర బేరం పెట్టావ్రా? ఏదీ పైకి తియ్! దాని మొహ మెలా వుందో చూదాం.”

దువ్వెన బయటికి తీసి చూపించాడు.

“నాకులాగే వుందిరా! పళ్ళు విరిగి జిడ్డుగారుతూ...” నాయనమ్మ విరగబడి నవ్వింది. “ఇదేనట్రా? నిన్నా మొన్నా ఈ తలుపుమూలా, ఆ గూట్లో—చిక్కుడుపాదులుదగ్గరా పడేసున్నావుంటే ఎవరికీ అక్కరలేకపోయింది..... ఇవ్వాళ దీనికి కొమ్ములు మొలిచాయట్రా?”—

“మన పక్కింటి గోపాలందగ్గర దువ్వెనుందే! వాడు నిన్న బళ్ళోకి తెచ్చి చూపించాడు. ఇవ్వాళ ఆ వెధవగాడికి చూపించి ఉడికించాలి.”

“అఁ మీ తగువులు వింటూ కూర్చోడానికి తీరుబడిలేదురా! ఎలాగో తగలడండి”—మంగతాయారు వంటింట్లోకి జారుకుంది!

ఇంట్లో ఇద్దర్లో—ఏ ఒక్కరు, ఏ వస్తువు సంగ్రహించినా, రెండోవాళ్లు సహించలేరు. అ

వాళ్లలో పొతుకున్న అపూర్వమైన లక్షణం—అది క్రిందటిగోజుదాకా అక్క డక్కడా పడేసుస్తూనే వుంటుంది! దాన్నెవరో, ఒకరు పైకి తీసేసరికి తుఫాను రేసుతుంది. ఆ రేగడం రేగడం మానినగాయం రేగినట్టు రేసుతుంది. ఇద్దరి మధ్యా విభిన్న దృక్పథాలు, విభిన్న ధ్రువాలు—నిబిడమైన కసి ఏర్పడి అప్పుడప్పుడు తీవ్రంగా ప్రకోపిస్తూ వుంటాయి. ఆ వస్తువుకోసం సాగించబడే హోరాహోరీ పోరాటంలో —వెయ్యిరాటం చప్పుళ్లు...కళ్లనించి విషాద బాష్ప ధారలు...గుండెలో తాత్కాలికంగా పోయే మకిలి చారలూ...

"వాడివ్వనంటున్నాడు మనమేం జేస్తాం" అంది నాయనమ్మ ఉస్సురుమంటూ, జపంలోకంటే దీంట్లోనే, మహా కష్టమున్నట్టు—

వీరిగాడు చేతులు జోబి కడ్డంపెట్టుకుని, మరీ మరీ చూసుకున్నాడు మళ్ళీ మళ్ళీ దువ్వెనకేసి... చాటుగా వెళ్ళి పైకితీసుకుని, కళ్లల్లో కళ్లుపెట్టి చూశాడు. విరిగిపోయిన పళ్లు లెక్క బెట్టాడు. ఒక చివర పెద్దపన్ను విరిగిపోవడం మనసు చివుక్కుమంది. ఐనా ఎంత బాగుండకపోతే, సీతి పొద్దుణ్ణించీ మారాం చేస్తుందీ? అంచేత ఇందులో గొప్పతనం వుండివుంది!

ఇంట్లో అనుభవించే హక్కంతా తనదే! అందుకే సీతి రిబ్బను కొనుక్కుంటే, తను రబ్బరు జోడు కొనుకున్నాడు. అది, ఆరణాలన్నర దుకాణంలో, సెల్యులాయిడ్ బూరా కొంటే, తనూ కొనిపించుకు తీరాడు. ఏది మానుతున్నాడు? ఒక్క పరికిణీ కుట్టించుకొంటే, లాగూ చొక్కా కుట్టించుకు తీరాలి. సీతికంటె రెట్టింపు లాభం పొందడానికి జూస్తున్నాడు. అలాంటేది, ఈ దువ్వెన, ఏ క్లిష్ట పరిస్థితుల్లోనూ, సీతా హస్తంగతం చేసి, తను చేతులు నులుముకుంటూ కూచోలేడు. అది మరొహటి కొనుక్కుందీ? తనూ పేచీపెట్టి కొనుక్కోవడ మెలాగూ వుందిగా! అదే తన గుండె మొండిధైర్యం!

*　　*　　*　　*

తన దువ్వెన్నింకెవరూ దురాక్రమణ చేయరనే ఉద్దేశ్యం కలిగాక, వీరి జోబిమీద చేతులుతీసి నిర్భయంగా తిరగడం మొదలుపెట్టాడు. గోపాలాన్ని పిలిచి, వాడికీవుదిదంతం చెపితే? తన నెత్తిమీద సగం భారం దిగిపోతుంది! వాడొచ్చేడంటే వాడి దువ్వనతో ఛాలంజీ చేసి చూపెడతాడు. "ఏరోయ్ నీ దువ్వెన వధవ నల్లకోతి ముహాం! నాది చూడు...రాజూ" అని తగులుకొని ఉడికిస్తూంటేఽ వాడు తెల్లముహం వేసి, ఒకటే పరుగు!...

తనకి, వాణ్ణి పిలిచి, చూపించాలనే తొందర ఎక్కువైంది! బళ్లో చూపెడితే...? అదో, ఎత్తు... ఇదో ఎత్తు...బళ్లోనే చూపెడితే ముహం పెసరట్టులా మాడుతుంది!

మంగతాయారు చద్దెన్నం తినడానికి పిలిచింది. సీతికీ, తనకీ పదిగజాల దూరంలో ఆకు వేయించుకున్నాడు.

"ఇద్దరూ, ఒక పొత్తులోనే కూచోండర్రా! రెండాకు లెందుకూ?" అంది నాయనమ్మ అమ్మయొయ్యో!...ఇంకేమున్నా వుందీ?...

"అమ్మో! ఇంకేమున్నా వుందీ...? ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది"—

మంగతాయారు పెరుగు వడ్డిస్తూ అంది.

వీరిగాడు, పెరుగూ మీగడా అన్నీ వేసుకు తినేశాడు.

"దానికి లేదేమిటే పెరుగు?"అంది నాయనమ్మ.

"లేదు...చిన్న వెండిగిన్నె నిండా నే తీశాను! అంతా వాడికే సరిపోయింది"—

సీతికి మజ్జిగ పోసిందంతే!

"వీడిదే నేమిటే? హక్కు భుక్తం!...అంతా వీడే బొక్కెయ్యాలా?"—నాయనమ్మ సీత తరఫున వకాల్తా పుచ్చుకుని అంది—

"ఏమిటదీ?...అప్పుడే హక్కు భుక్తాలంటున్నారూ?"—బజారు కెళ్ళిన సోమేశం కూరలుసంచీ చేత్తో పట్టుకుని రంగంలోకి ప్రవేశించాడు.

"చూడరా! వీరిగాడి చుప్పనాతితనం?...... దానికి లేకుండా మీగడా పెరుగూ వీడే బొక్కేశాడు. వీడి ఆగడం మరీను."

నాయనమ్మ నేరం ఆరోపించింది. మంగతాయారు 'అవునండీ' అంటూ, ఋజువు వాక్యాలు పలికింది.

"మీ యిద్దరూ దాని తరఫయితే, వీరిగాడి తరఫెవరూ?"

"నువ్వుండు నాన్నా!.........నువ్వుండు" అన్నాడు వీరిగాడు భుజా లెగరేసుకుంటూ వచ్చి కాళ్ళని చుట్టబెట్టుకొంటూ.

"తండ్రీ కొడుకూ ఏకమైతే ఇంటికి నిప్పెట్టినట్టే" సీతి అదనుకని పెట్టి, "నా దువ్వెన నాకిప్పించిమనవే!" అంది.

"దువ్వెన పిచ్చి నీకు బాగా పట్టిందే! పొద్దుణ్ణించి దాన్ని వదిలావు గావు ప్రాణాలయినా వదు-

ల్లావు గాని...నువ్వూ ఆడదానివి. మేమెవరం గాము...దానికి, వాడి జోబీల్లో దువ్వెనిప్పించండీ! సగం గొడవ తగ్గుతుంది!"

"ఆ దువ్వెన దాని కెందుకూ? అది వాడిది"

"ఐతే మరోహటి కొనివ్వండి దానికి"

"కావాలంటే మీరే కొనుక్కోండి, మాకేం? నీదువ్వెన బయటికి తియ్యరా! అమ్మనీ, చెల్లినీ, నాయనమ్మనీ, ఆడిద్దాం"

నవ్వుతూ, అన్నాడు సోమేశం!

"బాగా నేవుంది చిన్నపిల్లాడిలా! మీరేం ఏడిపించనక్కరలా...కావాల్సినప్పుడు మేమేవిడుస్తాం! ...నీళ్లు మరిగిపోతున్నై స్నానానికి రండి!"

వీరిగాడు గర్వరేఖముఖంమీద నాట్యమాడుతూ వుంటే బయటికి తీశాడు ఆ దువ్వెన కొస్తా.

"ఓశ్ ...ఇదేం దువ్వెన్రా!...కుళ్లు కాలవలో పారేయాల్సిందీ!...పళ్ళు విరిగీ...మొహం విరిగీ... అవతల పారెయ్ మంచిది కొనుక్కుందాం?"

"ఊహుఁ నేను పారెయ్యను. గోపాలంగాడికి చూపించి, నా గొప్పతనం చూపించాలి. నిన్న వాడిలాంటిదే బళ్లోకి తీసుకొచ్చాడు"

"పారేయ్‌రా సీతికి పారేయ్! మనం మంచిది కొనుక్కుందామన్నాంగా... ఒక పేకెట్టు దువ్వెన్లు తెస్తాను! ఊఁ పారేయ్!...పారెయ్ మరి"

వీరిగాడికి, అది పారేసేందుకు, ఏవిధంగానూ మనస్కరించలేదు. మీదు మిక్కిలి తిరస్కరించాడు.

"పారేయ్‌మంటే పారేస్తావా?..."

కళ్లెర్రజేశాడు కోపం నటిస్తూ సోమేశం!

"ఏదీ కొత్తదువ్వెన?"

బిక్కుబిక్కుమని చూస్తూ అన్నాడు అదిస్తే, ఇది పారేస్తానన్నట్టు.

"అది పారేయ్ చెప్తా."

కసిరాడు. ఇక వాడిదగ్గర్నుంచి, అది పారేయిస్తేనేగాని, శాంతిలేనట్టనిపించింది. సీతి ముఖం వాడి వత్తైవుంది. ఏడ్చిందేమో...కన్నీటి మకిలి ధారలు కళ్లనిండా కిలంపట్టి వున్నయ్!

శిథిలగృహాన్ని విడవలేక విడిచినట్టు విడిచాడు. పగిలిపోయిన గాజు కూజాని పారేయలేక పారేసినట్టు పారేశాడు. దాని కింకా దగ్గరగా నిలబడుతూ, సీతి వచ్చి కిందపడిందాన్ని లాగేసుకుంటుందేమో అని భయపడుతూ...చూస్తున్నాడు పులుకు పులుకున!

సీతిని, "తీసుకోవే!" అని గదమాయించాడు. సీతి నసిగింది. భయపడింది.

"నాకూ...కొ.. త్త...దువ్వె...నా" అని సాగదీసి సాగదీసి అంది ప్రతీ అక్షరాన్నీ. "పళ్ళు విరిగిపోయింది! అదెందుకు నాకు" అంటూ.

"దానికోసమే...ఇందాకణ్ణుంచీ, కీచులాటా, పెడబొబ్బలూ...ఏడుపులూ ఎందుకూ మరి" కళ్లల్లో కోపం వేలాడుతూంటే గర్జించాడు. బలవంతంగా చేతుల్లో పెట్టబోయాడు. తోసి పారేసింది.

వీరిగాడి మొహం వెలవెలబోయింది. ఎందుకు వద్దంది? తను కొత్తది కొనుక్కుంటాననేసరికి, దాని చెవులు నిక్కాయి. ఇప్పుడా, పాత పనికిరాని పాడుదువ్వెన పళ్లు విరిగిం దెవడిక్కావాలి?... సోమేశం చాలా ప్రయత్నం చేశాడు ఆ దువ్వెన అంటగడదామని సీతికి...సీత కళ్లంట మళ్ళీ నీళ్ళు తిరిగాయి. "నాకు కొత్తదే కావాతి" అంటూ కూచుంది. సోమేశం వీరిగాడివైపు తిరిగాడు. "పోన్లే! నువ్వే తీసుకోరా! దాని కొద్దట..."

"నాకు కొత్తది కొంటానన్నావు గాదూ? అది దానికిచ్చేయ్" అన్నాడు వీరిగాడు బిక్కమొహం వేసుకుని—

"ఏడిశారు! అసలు మీకు దువ్వెన్లెందుకంట? బోడితలలూ మీరూను" అని కసురుకున్నాడు.

"నువ్వెనా కొంటానన్నావూ?..." అన్నాడు వీరి. "ఊఁ కొనివ్వండి! చెరోహటి! మీరే రేపెట్టారు! వాళ్ళలో వాళ్ళే ఏదో గొడవపడితే ఏదో ఔను. మీరుచేసిన నిర్వాక మేమిటి?...కొనివ్వక పోతే, మీ భుజాలెక్కి తాండవమాడుతారు! ఏది కనిపిస్తే అది పగలగొడతారు." అని దెప్పి పొడిచింది మంగతాయారు.

సోమేశం కొనక తప్పదన్నట్టు వాతావరణం బలంగా సూచిస్తోంది. ఆమాట కొట్టిపారేయాలని చూస్తున్నా సోమేశానికి, పిల్లలకి దువ్వెన్లెందుకూ? అన్న ప్రశ్న తలెత్తింది.

"ఎందుకురా? ఈ దువ్వెన్లు మీకు"

---

వీరిగాడికి నవ్వొచ్చింది. ఐనా మెళుకువగా నవ్వకండా, "దువ్వుకోడానికి" అన్నాడు. వీరికి కాపుకి సరిపడేటంత జుట్టే లేదుగదా! మొన్నె అన్నవరంలో జుట్టు తీయించుకొచ్చాడుగదా?... అసలెందుకు ఈ సమస్య?—"

"జుట్టురానీ...నీకు కొంటా! ఏవేఁసీతీ! అమ్మ దువ్వెన్తో దువ్వకోనువ్వ"—

"సరే" అని బుర్రూపింది సీతి.

అసలు కలహకారణంగా రసమయ పట్టులో ఓలలాడిన, ఆబోసి దువ్వెన, పళ్ళువిరిగిన దువ్వెన... ఐదునిమిషాల్లో స్వేచ్ఛగా పెంటమీద దొర్లాడుతోంది!